## 9 స్తుతి గీతము

రా – శంకరాభరణము తా – ఏక

ప్రబలముగనే – ప్రస్తుతించెద – ప్రభుని కృపలన్ని = ప్రతి దినము
నిను – ప్రచురపరచెద – ప్రభుడ నావిభుడా ॥ప్ర॥

1. పొందుగోరి నా – యందు నిలిచిన – బంధుమిత్రుడవు = మందమతి కా – నందమొసగిన – మహిమతేజుడవు ॥ప్ర॥
2. చింతదీర్చి నా – భ్రాంతి మార్చితి – వెంత వింతదియో = స్వాంతమున కడు – శాంతిగూర్చితి – వెంత కరుణదియో ॥ప్ర॥
3. నీతి కరపిన – జాతి మరపిన – ఖ్యాతి యేసునిదే = నీరసుడ నను – గారవించిన నీతిరాజితడే ॥ప్ర॥
4. జీవమిచ్చిన – జావవచ్చిన – దేవసుత నీవే = జీవదాయక – బ్రోవరా యిక – జాలమేలనురా ॥ప్ర॥
5. నిమిషనిమిషము – నిను భజించెద – నెమ్మనంబునను = శమదమాది – సుగుణశోభిత – సమ్మదిని నిమ్మా ॥ప్ర॥

– చెట్టి భానుమూర్తి

## 10 దేవుని ప్రేమ

రా – జంఝూటి తా – ఆది

ఎంత ప్రేమ యెంత ప్రేమ యెంత ప్రేమయా – దేవుఁ = డెంత
గొప్ప ప్రేమయై వెలుంగుచుండునే ॥ఎంత॥

1. ఎంత లోతు ఎంత నిడివి యెంత విరివయా – దాని = నింత యంతయని వచించు మనుజుఁ డెవ్వఁడు ॥ఎంత॥
2. మనమునఁ దలపోయ నూహకంద దెంతయున్ – దానిఁ = జనువుఁగ జగమందుఁ బొగడ మాట లందవే ॥ఎంత॥
3. దేవదూతలైన దానిఁ బాడలేరట – యింక = దేవుఁడే తన సుతు నొసంగి ఇంత యది యనెన్ ॥ఎంత॥
4. ఇంత గొప్ప ప్రేమఁ జూప నూరకుందునే – ప్రభు = జెంతఁజేరి సంత తంబు ప్రీతిఁ జేసెదన్ ॥ఎంత॥



## 11 దేవుని వైపు చూచుట

రా – కమాసు తా – త్రిపుట

చూచుచున్నాము నీ వైపు – మా ప్రియ జనక – చూచుచున్నాము
నీవైపు = చూచుచు నీ ప్రేమ – సొంపు సువార్తను – జాఁచుచుఁ గరములు –
చక్కఁగా నీవైపు ॥చూచు॥

1. మే[1]మరులమై యుంటిమి – మార్గము వీడి – మేమందరము పోతిమి = ప్రేమచే నప్పుడు – ప్రియ తనయు నంపించి – క్షేమమార్గము మాకుఁ – బ్రేమను జూపితివి ॥చూచు॥
2. నిను నమ్ము పాపులకు – వారెవరైన – నీ శరణుఁ జొచ్చువారలకు = [2]ఇనుఁడవు [3]కేడెంబు – నీ జగతిలో నగుచుఁ – గనుపరచుచుందువు – ఘన మైన నీ కృపఁ ॥చూచు॥
3. నీ భయము మాయెదలను – నిలుపుము నీదు – ప్రాభవ మొనరంగను = నీ భయముచే మేము – వైభవ మొందుచు – నే భయము లేకుండ – నీ భువిని గొన్నాళ్ళు ॥చూచు॥
4. దయఁజూచి మము నెప్పుడు – మంచివి యన్ని – దయచేయు మెల్ల ప్పుడు దయచేయరానివి దయచేయుమని కోరఁ – దయజూపి మన్నించు – దయగల మా తండ్రి ॥చూచు॥

– పులిపాక జగన్నాథము

## 12 యెహోవా దేవుని స్తుతి

(103–వ దావీదు కీర్తన)

రా – ఆనందభైరవి తా – ఆది

దేవ సంస్తుతి చేయవే మనసా – శ్రీ – మంతుడగు యెహోవా సంస్తుతి
చేయవే మనసా = దేవ సంస్తుతి చేయుమా నా – జీవమా యెహోవా
దేవుని – పావన నామము నుతించుమా – నా యంతరంగము – లో వసించు
నో సమస్తమా ॥దేవ॥

---

[1]శత్రువులము. [2]సూర్యుఁడవు. [3]డాలు